క్లుప్తంగా

భక్తాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణం తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారణ వేసిన ఆంజనేయ స్వామి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అన్నప్రసాద దాతలు సామ ప్రభాకర్ రెడ్డి,ఝాన్సీ, గురు స్వాములు కత్తుల జగన్, వట్టిపల్లి శ్రీని వాస్, కొంగరి జగన్, లింగయ్య, రవి నాయక్, సింగం ప్రవీణ్, మహేశ్వరి, అల్లంపల్లి చంద్రశేఖర్, శేఖర్ పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి డాక్టరేట్


పట్టా అందుకుంటున్న శ్రీనివాస్

తిప్పర్తి: తిప్పర్తి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆవుల శ్రీనివాస్ యాదవ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి శనివారం ప్రొఫెసర్ దీప్లా చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు.కంపరేటివ్ ఎనాలసిస్ ఆఫ్ సెలక్టెడ్ మోటర్ ఫిట్‌నెస్ అండ్ ఫిజియోలాజికల్ వేరియబుల్స్ అమోంగ్ హైస్కూల్ కోకో అండ్ కబడ్డీ ప్లేయర్స్ ఆఫ్‌సెంట్రల్ తెలంగాణ టాపిక్ పై అతడికి డాక్టరేట్ దక్కింది. హెచ్‌ఎం టి.అరుణశ్రీ, ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్‌ను అభినందించారు.

అప్రమత్తత అవసరం

నకిరేకల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగర్ కోరారు.నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మాకర భవనంలో సోమవారం జరిగిన పీవైఎల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రతినిధులు బివి.చారి,అంబటి నర్సయ్య, పిట్టల అనిల్, పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

నల్లగొండ రూరల్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఎంజీయూలో ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవి, అధ్యాపకులు మద్దిలేటి, శేఖర్, వీరస్వామి, హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణపై అవగాహన

తిప్పర్తి: జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా..ప్రదీప్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు కాలుష్య నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోర్ వీలర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


అధ్యక్ష, ఉపాధ్యక్షుడికి సన్మానం చేస్తున్న కమిటీ సభ్యులు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఫోర్ వీలర్స్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడిగా జెట్టి యాదయ్య, ఉపాధ్యక్షుడిగా ముంత నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా దేవగాని శేఖర్, కోశాధికారిగా బైరోజు రామమూర్తి, సలహాదారుడుడిగా కానుగు జాని,సభ్యులుగా చాద్‌పాష, రమేష్, సంతోష్, ముంత వెంకన్న, బాకీ నరేష్‌ను ఎనుకున్నట్లు తెలిపారు.

మృతురాలికి నివాళి


నివాళులర్పిస్తున్న సుఖేందర్‌రెడ్డి

తిప్పర్తి : నల్లగొండ మాజీ మార్కెట్ చైర్మన్ వల్లపురెడ్డి కొటిరెడ్డి కొడలు వల్లపురెడ్డి స్వాతి గురువారం సౌతాఫ్రికాలో అనారోగ్య కారణాలతో మృతిచెందింది.ఆమె మృతదేహాన్ని సోమవారం నల్లగొండలోని కోటిరెడ్డి నివాసానికి తీసుకురాగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి , మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిండుకుండలా శాలిగౌరారం ప్రాజెక్టు

- యాసంగి పంటకు సరిపడా నీటినిల్వ
- ఆయకట్టు మొత్తానికి అందనున్న సాగునీరు
- ఆనందంలో ఆయకట్టు అన్నదాతలు


పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతున్న శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతూ యాసంగి పంటకు ఆయకట్టు మొత్తానికి సాగునీందించేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే వానాకాలం పంటకు సాగునీరందించిన ప్రాజెక్టులోకి మూసీనది ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరడంతో పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతుంది.

శాలిగౌరారం ప్రాజెక్టుకు శతాబ్దాల చరిత్ర

జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులలో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టుకు శతాబ్దాల చరిత్ర ఉంది. సుమారు 800 ఏళ్ల క్రితం రాజ్యాన్ని పాలించిన కాకతీయ మహరాజులు శాలిగౌరారం చెరువును నిర్మించారు. కానీ చెరువులోకి నీరువచ్చేందుకు ఏలాంటి మార్గాలను ఏర్పాటు చేయలేదు. వందల ఏళ్ల తర్వాత ఈ ప్రాంతాన్ని పాలించిన నిజాం నవాబులు షా, అలీ అనే ముస్లిం నవాబులు 1908లో శాలిగౌరారం చెరువును ప్రాజెక్టుగా తీర్చిదిద్దారు. అందులో భాగంగానే మూసీనదిపై ప్రస్తుత రామన్నపేట మండలం పల్లివాడ వద్ద మూసీనదికి అడ్డంగా ఆనకట్ట నిర్మాణంతోపాటు హెడ్‌రెగ్యూలేటర్‌ను నిర్మించారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు సుమారు 30 కిలోమీటర్లు రాచకాల్వను తవ్వారు. దీంతో నాటి నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుంది.

21 అడుగుల నీటి సామర్థ్యం

శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటిసామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 20 అడుగులు. ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 700 ఎకరాలు శిఖం భూములు కాగా 500 ఎకరాలు పట్టాభూములు ఉన్నాయి. ప్రాజెక్టు పరిధిలో మండలంలోని శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, గురుజాల, అడ్లూరు, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాలలోని 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ సంవత్సరం ఇప్పటికే వానాకాలం పంటకు ప్రాజెక్టు నుంచి సాగునీరందగా యాసంగి పంటకు సాగునీరందే అవకాశం ఉండటంతో ఆయకట్టు రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూడికతీత చేపట్టుకున్నాం



శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతూ యాసంగి పంటకు సాగునీరందించేందుకు సిద్ధంగా ఉండటం సంతోషంగా ఉంది. ఇప్పటికే వానాకాలం పంటకు ప్రాజెక్టు నుంచి సాగునీరు అందడంతో ప్రధాన కాల్వలు పూడికతో నిండిపోయాయి. దీంతో సాగునీరు ఆయకట్టు చివరికి అందాలనే ఉద్దేశంతో రూ.40 వేలు సొంత ఖర్చుతో కాల్వ పూడికతీత పనులు చేపట్టాం.

– చామల జయపాల్‌రెడ్డి, రైతు, శాలిగౌరారం

సకాలంలో సాగునీటిని అందించాలనే..



శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి ప్రస్తుత యాసంగి పంటకు సకాలంలో సాగునీరందించాలనే లక్ష్యంతో ఉన్నాం .అందుకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో ఆయకట్టుకు సరిపడా నీరందనుండటంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం యాసంగి పంటకు నారుపోసుకునే అదును కావడంతో రైతులకు సరైన సమయంలో సాగునీరు అందనుంది.

– సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈఈ, శాలిగౌరారం ప్రాజెక్టు

నీలగిరి అభివృద్ధికి కృషి


శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేయనున్న శక్తి పోల్స్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ 5 రోడ్ల కూడలిలో వెలుతురు సరిగా లేకపోవడంతో పలువురు మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల మేరకు శక్తి పోల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో రేగట్ట లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ


ప్రజావేదికలో మాట్లాడుతున్న అడిషనల్ పీడీ నవీన్

కట్టంగూర్ : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ పీడీ నవీన్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూలీలకు పనులు అడిగిన వెంటనే కల్పించాలన్నారు. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2024 వరకు జరిగిన పనులపై ప్రజా వేదిక నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయితీల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికను చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.5,93,13,213 కోట్లు ఖర్చు చేయగా కూలీలకు రూ.5,65,60,157, సామగ్రికి రూ.27,53,056 చెల్లించినట్లు అధికారులు తెలిపారు. సామాజిక తనిఖీలో ఉపాధి సిబ్బందితోపాటు పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.24,562 లను రికవరీ చేయాలని అధికారులను పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీలు యామినిరెడ్డి, నర్సింహ్మారావు, డీవీఓ వేణుగోపాల్ రావు, ఫసియోద్దీన్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ఏవీఓ గౌతమి, ఏఈలు జమీల్, నవీన్, ఏపీఓ కడెం రాంమోహన్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే విజయోత్సవాలు


మాట్లాడుతున్న నకిరేకంటి మొగిలయ్య

నకిరేకల్ : విజయోత్సవాల పేరుతో ప్రజలను ప్రభుత్వం మభ్యపెట్టాలని చూస్తోందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నకిరేకంటి మొగిలయ్య అన్నారు. నకిరేకల్‌లో సోమవారం జరిగిన ఆ పార్టీ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ఎండగట్టేందుకు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా రెండు రోజుల బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నాయకులు యానల శంకర్‌రెడ్డి,గర్రె మురళి, బుడిగే సైదులు, చినేని జానీ,ఐతగోని అనిత, గోలి ప్రభాకర్, మధుకర్, వనం అంజయ్య, గుడుగుంట్ల సాయన్న, కోండెటి శ్రీను, కోరివి శంకర్, నర్సింహ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

నకిరేకల్ : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం–327(ఐఎన్‌టీయుసీ) నల్లగొండ డివిజన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి సమ్మిరెడ్డి కోరారు. నకిరేకల్‌లోని ఓ ఫక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన ఆసంఘం డివిజన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.సబ్ డివిజన్ పరిధిలో 100 మంది విద్యుత్ ఉద్యోగుల సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పాటుపడుతుందన్నారు. ఈసందర్భంగా సబ్ డివిజన్ సెక్షన్ లీడర్లను ఎనుకున్నారు.సబ్ డివిజన్ అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాస్, కార్యదర్శిగా ఎస్.వెంకన్న, నకిరేకల్,కేతేపల్లి, కట్టంగూర్, శాలిగౌరారం మండలాల సెక్షన్ లీడర్లుగా ఎస్.సంజీవ, పి.రాములు, పి.రవికుమార్. వై.సైదులు ఎన్నికయ్యారు. సమావేశంలో కంపనీ సహాయ కార్యదర్శి అబ్బాస్ అలీ, జిల్లా అధ్యక్షుడు అమర్‌కుమార్‌రెడ్డి, సంఘ ప్రతినిధులు పాండు, శంకరయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మురళి, సైదులు, నరేందర్, వెంకటేష్, నగేష్, బుచ్చిరాముల, శ్రీనయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు


మాట్లాడుతున్న తహసీల్దార్ యాదగిరి

శాలిగౌరారం: గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ హాస్పిటల్స్ ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ యాదగిరి అన్నారు. శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురిజాల అనంతరామశర్మ జ్ఞాపకార్థం అతని కుమారుడు వెంకటేశ్వర్లు–రమాదేవి దంపతుల సహకారంతో నల్లగొండ పట్టణానికి చెందిన సంకల్ప హాస్పిటల్ నేతృత్వంలో శాలిగౌరారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, హాస్పిటల్ వైద్యులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్‌స్థాయి హాస్పిటల్స్ వారువచ్చి ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పద్మ, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎర్ర శంభులింగారెడ్డి, గంట అంజిరెడ్డి, బుడిగె శ్రీనివాసులు, డెంకెల సత్యనారాయణ, దునుక వెంకన్న, రామడుగు వెంట్రామశర్మ, దామెర్ల శ్రీనివాసులు, వడ్లకొండ భిక్షం , కర్ణాకర్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

షాపల్లి నుంచి చెర్వుగట్టుకు పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న షాపల్లి అయ్యప్ప స్వాములు

నార్కట్‌పల్లి : మండలంలోని శాపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి మాల ధరించిన అయ్యప్ప భక్తులు సోమవారం కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి మండల పరిధి చెర్వుగట్టులోని శ్రీ పార్వతి జడాల రామలింగేశ్వర స్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్నాటి ఉపేందర్ తదితరులు ఉన్నారు.

ఆలయం వద్ద భక్తుల సందడి


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కనగల్: భక్తుల పాలిట కొంగుబంగరంగా విరాజిల్లుతున్న కనగల్ మండలంలోని దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద మార్గశిరమాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మహిళ భక్తులు ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు.

సంక్షిప్త సమాచారం

నకిరేకల్ ఏడీఏగా హరిత

నకిరేకల్ : నకిరేకల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) గా హరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె హైదరాబాద్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

మాలమహానాడు గ్రామ కమిటీ ఎన్నిక

మర్రిగూడ : మండలంలోని తిరగండ్ల గ్రామ మాల మహానాడు నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి మాల మహానాడు మండల అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం ఆయన అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెల్లం శంకర్, ఉపాధ్యక్షులుగా బత్తుల వెంకటయ్య, జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా బత్తుల పెద్దిరాజు, కోశాధికారిగా పెద్దయాదయ్య, యాదయ్యను ఎన్నుకున్నారు.

రైతులకు రుణ మాఫీ వర్తింపు

నకిరేకల్ : నకిరేకల్ మండలంలోని 607 మంది రైతులకు రూ.6.29 కోట్లు రుణమాఫీ వర్తించిదని మండల వ్యవసాయాధికారి జానిమియా సోమవారం వెల్లడించారు. రేషన్ కార్డు లేని రైతులకు రుణ మాఫీ నిధులు విడుదల చేసిందని తెలిపారు. మరో 3 మూడు రోజుల్లో ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ధర్నా

నల్లగొండ అగ్రికల్చర్ : జీఓ 81 ప్రకారం వీఆర్‌ఏ వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ఎల జేఏసీ జిల్లా నాయకులు సీహెచ్ లక్ష్మీ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపు మేరకు పట్టణంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నగేష్ కుమార్, జాని, శంకరయ్య, సుదాకర్, మట్టయ్య, రవి, మహమూద్ అలీ పాల్గొన్నారు.

పేదలకు వసతులు కల్పించాలి

నల్లగొండ అగ్రికల్చర్ : నిరేపేదలకు అన్ని రకాలుగా వసతులు కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు మహరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పేదలకు విద్యా, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేశారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ మహేశ్వర చారి, శంకరయ్య, ఎల్లయ్య, గిరి, జగన్, వినోద్, రవి, సైదులు, పరమేష్, నగేష్, గోవర్ధన్, ఈశ్వర్, మల్లికార్జున్, దేవేందర్, గిరి, మట్టయ్య పాల్గొన్నారు.

సర్వే బకాయిలు చెల్లించాలని ధర్నా

నల్లగొండ అగ్రికల్చర్ : మూడు సంవత్సరాల నుంచి ఆశ వర్కలర్లకు రావాల్సిన లెప్రసీ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేసి డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లెప్రసీ బిల్లులు వెంటనే చెల్లించకపోతే డిసెంబర్ 2 నుంచి 15 వరకు లెప్రసీ సర్వేను నిలిపివేస్తామని హెచ్చరించారు. టీబీ, పల్స్ పోలియో, ఎన్సీడి పారితోషికాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో పెంజర్ల సైదులు, మహేశ్వరి, వెంకటమ్మ, పార్వతమ్మ, జయమ్మ, నవనీత, ధనమ్మ, సైదమ్మ, లలిత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మర్రిగూడ: మండల కేంద్రానికి చెందిన గట్ల మాధవి ఇటీవల అనారోగ్యానికి గురికాగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.28వేల చెక్కును సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ లబ్దిదారుకి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాస నీలిమాచంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, నాయకులు పానుగోటి శేఖర్, ఎండి.అశ్వక్, ఎడ్ల ముత్తయ్య, ఎలిమినేటి సత్తిరెడ్డి, మేతరి శంకర్, సిలివేరు యాదయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నాంపల్లి : మండల కేంద్రంలోని తిప్పని ఎల్లారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారు జామున హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి,సింగిల్‌విండో డైరెక్టర్ కుంభం కృష్ణారెడ్డి పరామర్శించి నివాళులర్పించారు. వారి వెంకట పానగంటి వెంకటయ్య, ఈద శేఖర్, శ్రీను, పన్నల మల్లయ్య, కొరే కృష్ణయ్య, నాంపల్లి హనుమంత్, రాములు, పంగ కొండయ్య, భిక్షం, గాదేపాక రమేష్ ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలి


నియామక పత్రం అందజేస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి

తిప్పర్తి : బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు.ఆయన సోమవారం మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో బూత్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.రాబోయో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీజేపీ జెండాను ఎగరవేయాలన్నారు. అనంతరం నూతన బూత్ కమిటీని ఎన్నుకున్నారు.తానేధార్‌పల్లి గ్రామ భూత్ కమిటీ అధ్యక్షులుగా మాదగోని వెంకన్నను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పల్లే ప్రకాశ్,నాయకులు వంగూరి రవి,ఎస్ యాదగిరి,దేసోజు శివ, శంకర్, మధు, సతీష్, దిలీప్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్


శాలిగౌరారం ప్రాజెక్టునుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: రైతు సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌లు అన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఒకటైన శాలిగౌరారం ప్రా జెక్టు నుంచి ప్రస్తుత యాసంగి పంటకు సోమవా రం సాగునీటిని విడుదల చేసి మాట్లాడారు. ప్రాజె క్టు ద్వారా మండలంలోని తొమ్మిది గ్రామాల్లోని సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరందడం గొప్ప విషయంగా అభివర్ణించారు. రైతులు సాగునీటిని వృథా కానివ్వకుండా పొదుపుగా వాడుకొని ఆయకట్టు చివరి రైతులకు సాగునీరందేలా సహకరించాలని సూచించారు. నీటి పారుదలశాఖ అధికారులు సాగునీటి విషయంలో ఆయకట్టు రైతులు ఇబ్బందులకు గురికాకుండా ప్రాజెక్టుపై నిత్యం పర్యవేక్షణ జరుపాలన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి మూసీనదిని ప్రక్షాళన చేసి పూర్వ వైభవానికి తీసుకువచ్చేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఇరిగేషన్ డీఈఈ సత్యనారాయణ, ఏఈ రాములు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు చామల వెంకటరమణారెడ్డి, జయపాల్‌రెడ్డి, అన్నెబోయిన సుధాకర్, చింత ధనుంజయ్య, బండారు మల్లయ్య, నరిగె నర్సింహ, నోముల జనార్ధన్, భూపతి అంజయ్య, సామ చంద్రారెడ్డి, జోగు శ్రీను, అల్లి సైదులు, పరమేశ్, దేవేందర్, శ్రీను, నర్సింహ అంజయ్య, రమేశ్, వీరస్వామి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ద్రోహి

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా పనిచేసిన మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విద్యార్థుల జీవితాలను నాశనం చేసిన ద్రోహి అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం పర్యటించిన ఆయన స్థానిక కేజీబీవీని ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలో నేలపై కూర్చొని విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం విద్యాలయంలోని తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటగది, నిత్యావసర వస్తువులు, తాగునీటి సౌకర్యం, సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు చామల జయపాల్‌రెడ్డి, అన్నెబోయిన సుధాకర్, చింత ధనుంజయ్య, బండారు మల్లయ్య, నరిగె నర్సింహ, జనార్దన్, పరమేశ్ పాల్గొన్నారు.

చందంపల్లిలో ఘనంగా అయ్యప్ప పడిపూజ

నకిరేకల్: నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలోని అయ్యప్ప పడి పూజ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ నేత దైద రవీందర పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ అయ్యప్ప దేవాలయం చైర్మన్ నూకల రఘునందన్‌రెడ్డి, నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, నామిరెడ్డి క్రిష్టారెడ్డి, వంటేపాక నక్షత్, చెనగాని రాజేశేఖర్, సాయి, పరుశురాం, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, హర్షవర్ధన్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

కట్టంగూర్ : మండలంలోని కురుమర్తి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు నర్సింగు మారమ్మ (107) సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మారమ్మకు ఐదుగురు కుమారులు, కూతురు ఉన్నారు. వీరితో పాటు మనువళ్లు 10 మంది, మనువరాళ్లు 10 మంది, ముని మనువరాళ్లు 18 మంది, ముని మనువళ్లు 24 మందితో కలిపి మొత్తం 68 మందిని ఆమె చూశారని తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వినతి

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో దేవాదాయ, ధర్మదాయ శాఖ, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు సోమవారం చిట్యాల తహసీల్దార్ క్రిష్ణ నాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అధికారులు స్పందించి గ్రామంలోని ప్రభుత్వ భూములకు హద్దులను నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చేకూరి గణేష్ మాదిగ, రాకేష్, మాచర్ల యాదగిరి, దామోదర్ పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు అప్పగింత

కట్టంగూర్: బ్యాంకులో బంగారు ఆభరణాలు పోగొట్టుకున్న మహిళకు తిరిగి వాటిని అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు కట్టంగూర్‌కు చెందిన ఓ వ్యక్తి. ఎస్ఐ ఎం. రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంబటివాగు గ్రామానికి చెందిన మల్లెబోయిన లక్ష్మమ్మ తన కుమారుడితో కలిసి నవంబర్ 28వ తేదీన బైక్‌పై కట్టంగూర్ మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్‌గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు వెళ్లింది. బ్యాంక్ ఎదుట లక్ష్మమ్మ తన వెంట తెచ్చుకున్న సంచిలో ఉన్న పాసుపుస్తకం తీస్తుండగా.. బంగారు నగలు గల పర్సు కిందపడిపోయింది. ఇది గమనించని లక్ష్మమ్మ బ్యాంకులో పని ముగించుకొని ఇంటికి వెళ్లి సంచి చూడగా బంగారు నగలు పోయినట్లు గమనించింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఏపీజీవీబీలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా కట్టంగూర్‌కు చెందిన పిల్లి ఈదయ్య పర్సు తీసుకున్నట్లు గుర్తించారు. ఈదయ్యను పిలిచి విచారించగా తనకు పర్సు దొరికిందని ఒప్పుకొని నగలను పోలీసులకు అప్పజెప్పాడు. మూడు తులాల(పుస్తెలతాడు, చెవి దిద్దులు, ఉంగరం) బంగారు నగలను సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితురాలికి ఎస్ఐ అందజేశారు. బంగారు నగలు ఇచ్చిన వ్యక్తికి ఎస్ఐ రవీందర్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది దుర్గాప్రసాద్, ఉదయ్ ఉన్నారు.

మానవత్వం చాటుకుంటున్న 'వెదిర' బ్రదర్స్


యాదయ్యకు నగదు అందజేస్తున్న వెదిర బ్రదర్స్

మునుగోడు: ఆపదలో ఉన్న పేదలకు ఆర్థికసాయం అందజేస్తూ మానవత్వం చాటుకుంటున్నారు.. మునుగోడు మండలంలోని కొంపల్లికి చెందిన వెదిర బ్రదర్స్. కొంపల్లి గ్రామానికి చెందిన వెదిర మేఘూరెడ్డి, వెదిర విజయందర్ రెడ్డి ఏడాది క్రితం తమ తల్లి పేరుతో వెదిర పూలమ్మ ఫౌండేషన్ ఏర్పాటుచేసి ఆ గ్రామంలోని పేదలకు సహాయ, సహకారాలు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.10 లక్షలకుపైగా ఆపదలో ఉన్న పేదలకు నగదు సహాయం చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని అన్ని కులాల పెద్దలు దేవతల గుడి నిర్మాణాలకు విరాళాలు కోరగా అందుకు మరో రూ. 20 లక్షలకు పైగా అందజేసినట్లు చెబుతున్నారు. ఇటీవల ఆ గ్రామానికి చెందిన పగిళ్ల యాదయ్య మోకాలుకు ఆపరేషన్ చేయాల్సి ఉండగా అందుకు సామవారం రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు.